క్లుప్తంగా

మేయర్ రామయ్యను కలిసిన కమిషనర్



కర్నూలు (అర్బన్): నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్యను గురువారం కమిషనర్ రవీంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలోనే నూతన కమిషనర్‌ను డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు జుబేర్, యూనస్, క్రాంతి కుమార్, కృష్ణకాంత్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సాంబశివరావు, షేక్ అహ్మద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ కోత

కర్నూలు న్యూసిటీ : నగరంలోని రెండో సబ్‌డివిజన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శేషాద్రి నాయుడు ఒక ప్రకటలో తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం గణేష్ నగర్, రామచంద్ర మిషన్, రెవెన్యూ కాలనీ, సోమిశెట్టి నగర్, మాతృభూమి, సాయివైభవ్ కాలనీ, జంపాల అపార్ట్‌మెంట్, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీల్లో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అంతరాయనికి సహకరించాలని కోరారు.

22న గయో పాఖ్యానం నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు 'గయో పాఖ్యానం' (యుద్ధసీను) నాటక ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. పౌరాణిక నాటక రంగంలో గత 5 సంవత్సరాల నుంచి సంచలనం సృష్టిస్తున్న 15 సంవత్సరాల బాలిక ధూపం తిరుమల తేజ ఇందులో శ్రీకృష్ణ పాత్రను పోషిస్తుందని తెలిపారు. ధూపం రామకృష్ణ అర్జున పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

కేసీలో మద్దిలేటి మృతదేహం లభ్యం



కురువ మద్దిలేటి (ఫైల్)

కర్నూలు : స్థానిక పాతబస్తీలోని చిత్తారి వీధికి చెందిన కురువ మద్దిలేటి కేసీ కెనాల్‌లో శవమై కనిపించాడు. కనిపించకుండా పోయిన కుమారుడు దీపక్ ఏడాది అయినా తిరిగి రాలేదనే బెంగతో మద్దిలేటి మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతని కోసం గురువారం కేసీ కెనాల్ వెంట గాలిస్తుండగా జూపాడుబంగ్లా సమీపంలో నీటిలో తేలియాడుతూ కనిపించాడు. మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. మద్దిలేటి మృతికి దారి తీసిన కారణాలపై విచారణ జరుపుతున్నట్లు సీఐ రామయ్య నాయుడు తెలిపారు.

డాక్టర్ వెంకటరమణకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏఆర్ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ సీహెచ్ వెంకటరమణను గురువారం ఉద్యోగులు సన్మానించారు. ఆయన ఇటీవల అసిస్టెంట్ సివిల్ సర్జన్ నుంచి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది కర్నూలు మెడికల్ కాలేజీలోని ఎస్‌పీఎం విభాగంలో పోస్టింగ్ పొందారు. ఈ మేరకు ఆయనను ఆఫీస్ అకౌంటెంట్ కుమారస్వామి, సీనియర్ అసిస్టెంట్‌లు శ్రీనివాసులు, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే నర్సెస్ ఎన్నికలు నిర్వహించాలి

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలని పలువురు హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. గురువారం వారు కర్నూలు మెడికల్ కాలేజి ఆడిటోరియంలో సమావేశమయ్యారు. గత ఆరేళ్ల నుంచి ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేస్తూ వస్తోందన్నారు. ఈ కారణంగా ఆసుపత్రిలో ఏళ్ల తరబడి నర్సులకు సంబంధించిన సమస్యలు తిష్ట వేశాయని చెప్పారు. అసోసియేషన్ లేకపోవడంతో తమ సమస్యలు ఎవ్వరికి చెప్పుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కర్నూలు (అర్బన్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు పరిశీలించారు. పాతబస్తీ, ఎన్ఆర్‌పేట, బంగారుపేట, సంకల్‌బాగ్, కల్లూరు తదితర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడ కూడా పారిశుద్ధ్యం లోపించరాదన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పరిమళ నగర్, సెట్కూరు కార్యాలయం సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్లను పరిశీలించారు.

ఇక్కడ రోజుకొక ఆపరేషనే

- న్యూరోసర్జరీ ఓటీలో నెలరోజుల నుంచి పనిచేయని ఏసీలు
- ఫ్యాన్ ఏర్పాటు చేసుకుని ఆపరేషన్ చేస్తున్న వైద్యులు
- రోజుకొక్కరికే చేస్తుండటంతో మిగిలిన వారు ఎదురుచూపు



పెద్దాసుపత్రిలోని న్యూరోసర్జరీ విభాగం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అంటే రాయలసీమ జిల్లాలకు పెద్ద దిక్కు. అంతేగాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల రోగులూ ఈ ఆసుపత్రినే నమ్ముకుని వస్తారు. ఇలాంటి ఆసుపత్రిలో న్యూరోసర్జరీ విభాగం ఎంతో కీలకమైనది. కొన్ని దశాబ్దాలుగా ఈ విభాగానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరుంది. అందుకే నెలలపాటు ఇక్కడ ఉండి చికిత్స తీసుకుని మరీ వెళతారు రోగులు. ఇలాంటి ఈ విభాగంలో ప్రస్తుతం సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వీటిని తీర్చేనాథుడు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విభాగంలో ప్రధాన పాత్ర పోషించే ఆపరేషన్ థియేటర్‌లో నెల క్రితం ఏసీలు పనిచేయకుండా మొరాయించాయి. మాడ్యులర్ ఓటీగా తీర్చిదిద్దిన ఇందులో ఏసీలను మరమ్మతు చేయాలంటే నాలుగైదు లక్షల రూపాయల ఖర్చు అవుతుంది. ఈ నిధులు లేక అధికారులు ఏసీలు మరమ్మతులు చేయించలేకపోతున్నారు. దీంతో నెలరోజుల నుంచి ఈ ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు ఫ్యాన్‌ను ఏర్పాటు చేసుకుని రోజుకొక ఆపరేషన్ చొప్పున చేస్తున్నారు. ఒక్కో ఆపరేషన్ చేయడానికి రెండు, మూడు గంటల సమయం పడుతుండటంతో అప్పటికే వారు తీవ్రంగా చెమటోడుస్తున్నారు. పొరపాటున వారి చెమట ఆపరేషన్ చేయించుకుంటున్న రోగిపై పడితే ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ కారణంతో వైద్యులు ఎన్నో జాగ్రత్తలు తీసుకుని ఇక్కడ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. మరోవైపు ఏసీల మరమ్మతులపై ఆసుపత్రి అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలరోజులైనా మరమ్మతులు చేయించకపోవడంతో ఆపరేషన్ కోసం ఎదురుచూసే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

మానవ హక్కుల కమిషన్‌కు కల్లుకుంట ఘటన

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కల్లుకుంట గ్రామంలో జరిగిన అవమానవీయ సంఘటనను కేంద్ర మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకుపోవడం జరిగిందని బీఎస్ఎస్ చీఫ్, హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన దళిత గోవిందమ్మ అనే మహిళపై విచక్షణా రహితంగా జరిగిన దాడికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను న్యూఢిల్లీలో కమిషన్ చైర్ పర్సన్ విజయభారతి సాయిని అందించామని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎన్ఎస్ఆర్‌సీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్స్ అందించాలని ఏపీ పోలీసు, సంబంధిత ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిగే వరకు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు. కమిషన్‌ను కలిసిన వారిలో బీఎస్ఎస్ కో-కన్వీనర్ సునీల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ ఉన్నారన్నారు.

గులాబీరంగు పురుగు నివారణపై అవగాహన పెంచండి

కర్నూలు(అగ్రికల్చర్): పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. గురువారం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో పత్తిలో గులాబి రంగు పురుగు యాజమాన్యంపైన, ప్రకృతి వ్యవసాయ విస్తరణపై జిల్లాలోని ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ... గులాబిరంగు పురుగు సోకితే పత్తికి నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని కూడా మరింత విస్తరింప చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు, యాగంటిపల్లి కేవీకే శాస్త్రవేత్త బాలరాజు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం చంద్రశేఖర్, ఏడీఏ శ్రీనివాస సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

కర్నూలు కల్చరల్: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆర్‌యూ సెనేట్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు వర్సిటీ హాస్టళ్లతో పాటు సంబంధిత డిపార్ట్‌మెంట్‌ల పరిసరాలను శుభ్రం చేసుకొని స్వచ్ఛతకు పాటు పడాలన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా ఈ స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎండీఓ అనురాధ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పీవీ సుందరానంద్, ఎన్ఎస్ఎస్ వర్సిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బి. విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, పసుపుల పంచాయతీ సెక్రటరీ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్, తదితరులు

మసీదు కమిటీల్లో టీడీపీ జోక్యం తగదు

- ఆల్ ఇండియా ముస్లిం మైనారిటీస్ కౌన్సిల్ ఛైర్మన్ సయ్యద్ మహమ్మద్ పీర్

కర్నూలు(అర్బన్): పవిత్ర మసీదు కమిటీల్లో తెలుగు దేశం నాయకుల రాజకీయ జోక్యం తగదని ఆల్ ఇండియా ముస్లిం మైనారిటీస్ కౌన్సిల్ చైర్మన్ సయ్యద్ మహమ్మద్ పీర్ అన్నారు. మసీదు కమిటీలు, ఇమామ్‌లను తొలగింపు విషయంలో టీడీపీ నేతల ప్రమేయం లేకుండా మార్గదర్శకాలు ఇవ్వాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం కొందరు టీడీపీకి మద్దతు ఇస్తున్న ముస్లింలు తమ పంతం నెగ్గించుకునేందుకు మసీదు కమిటీల్లో జోక్యం చేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యేలను అడ్డం పెట్టుకొని మసీదులు, దర్గాలు, మదరసాలపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటివి వక్ఫ్ చట్టానికి విరుద్ధమన్నారు. మసీదులు అల్లాహ్‌కు చెందిన మందిరాలని, ఇలాంటి అధ్యాత్మిక ప్రదేశాల్లో రాజకీయాలను దూరంగా ఉంచాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మత ప్రదేశాల రక్షణ, ముస్లింల సంక్షేమం అత్యంత అవసరమన్నారు.

వైద్య పరీక్షల నివేదికలు త్వరగా ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్): ఎంతో సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులకు వైద్యపరీక్షల నివేదికలను త్వరగా ఇచ్చి సహకరించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో బయోకెమిస్ట్రీ విభాగంలో ఉన్న వైద్యపరికరాలను పరిశీలించి వాటి పనితీరు గురించి ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే రీ ఏజెంట్స్ ఏవి ఉన్నాయి, లోకల్ పర్చేజ్‌లో వాటికి సంబంధించిన స్టాక్ వివరాలు పరిశీలించి అవసరమైన వాటికి ఇండెంట్ పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. డ్రైనేజీ పనుల గురించి ఆరా తీసి మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

మెడికల్ షాపుల నుంచి బలవంతపు విరాళాలు

- ఒక్కో దుకాణం నుంచి రూ.5వేలు వసూలు

కర్నూలు(హాస్పిటల్): విజయవాడలో ఇటీవల జరిగిన వరదల్లో నష్టపోయిన వారికి సాయం చేయాలంటూ డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ నాయకుల పేరిట విరాళాలు వసూలు చేస్తున్నారు. వారం క్రితమే జిల్లాలోని అన్ని దుకాణాల నుంచి అవసరమైన మందుల కిట్‌లను తెప్పించి విజయవాడకు పంపించారు. తాజాగా ఒక్కో మెడికల్ షాపు నుంచి రూ.5 వేలు ఇవ్వాలని బలవంతంగా వసూలు చేస్తున్నారు. పట్టణాల్లో అయితే రూ.5 వేలు, మండల కేంద్రాల్లో ఉన్న షాపులైతే రూ.2 వేల చొప్పున అసోసియేషన్ నాయకులు వసూలు చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అసోసియేషన్ ద్వారా వసూలు చేస్తున్నామని స్థానిక నాయకులు చెబుతుండటం గమనార్హం. కర్నూలు జిల్లాలోనే 1200లకు పైగా రిటైల్ దుకాణాలు ఉన్నాయి. అన్ని దుకాణాల నుంచి అంతో ఇంతో వసూలు చేసి తప్పక పంపించాలని రాష్ట్ర ఉన్నతాధికారి ఆదేశించడంతో ఇక్కడి నాయకులు వసూళ్లకు దిగినట్లు సమాచారం.

అవీ-ఇవీ

వార్డు కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు (అర్బన్) : నగరపాలక సంస్థ, జిల్లా లోని వివిధ మున్సిపాలిటీల్లో విధులు నిర్వహి స్తున్న వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీల కు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థాని క నగరపాలక కౌన్సిల్ హాల్‌లో జరిగిన కౌన్సె లింగ్‌ను కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఓ జునైద్, డీసీపీ సంధ్య, సూపరింటెండెంట్లు మంజూర్ బాషా, రమేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో..

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీలు మొదలయ్యాయి. ఇందులో నాలుగో తరగతి ఉద్యోగలకు మినహాయింపు ఇచ్చినట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే ప్రాంతంలో ఐదేళ్ల పాటు విధులు నిర్వహించిన ఉద్యోగులను నిబంధనల మేరకు బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు.

బాధ్యతలు స్వీకరించిన జయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీగా ఆర్.జయలక్ష్మి పదవీ బాధ్యతలు స్వీకరించారు. డిప్యుటేషన్‌పై కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీని అనంతపురం మార్కెట్‌కు, అనంతపురంలో ఉన్న సెక్రటరీ జయలక్ష్మిని కర్నూలు మార్కెట్‌కు బదిలీ చేస్తూ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం సాయంత్రం సెక్రటరీ గోవిందు బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఆ వెంటనే సెక్రటరీగా ఆర్. జయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈనేపథ్యంలో అసిస్టెంటు సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్ తదితరులు బొకేలు సమర్పించి అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నిరసన

కర్నూలు(సెంట్రల్): శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, బీజేపీ నాయకులు నోటి దురుసు తగ్గించుకొని రాహుల్‌గాంధీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ నిరసనకు దిగింది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ..రాహుల్‌గాంధీపై అనుచిత వ్యా ఖ్యలు చేసిన శివసేన ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గైక్వాడ్‌పై కేసు నమోదుచేయాలని త్రీటౌన్ పోలీసుల స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యా దు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బా షా, నాయకులు పాల్గొన్నారు.

22న జలవనరుల శాఖ మంత్రి రాక

కర్నూలు (సిటీ) : జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 22న (ఆదివారం) జిల్లాకు రానున్నారు. ఉదయాన్నే కర్నూలు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని 7 నుంచి 8 గంటల వరకు స్థానిక నాయకులతో మంత్రి సమావేశమవుతారు. తర్వాత హంద్రీనీవా ప్రధాన పంపింగ్ స్టేషన్ మల్యాలను పంప్‌ను తనిఖీ చేయనున్నారు. అనంతరం హంద్రీనీవా కాలువ వెంబడి అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్ వరకు ఉన్న పంపింగ్ స్టేషన్లను పరిశీలించనున్నారు.

నేటి నుంచి ప్రజా వేదికలు

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సాధించిన విజయాలపై సెప్టెంబర్ 20 నుంచి 26వ తేదీ వరకు ప్రజావేదికలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం ఈ అంశంపై సబ్ కలెక్టర్, ఆర్‌డీఓలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

జంట హత్యల కేసు కొట్టివేత

కర్నూలు : నగరంలోని గిప్సన్ కాలనీ తేజా డీలక్స్ అపార్టుమెంటులో గతంలో జరిగిన పి.మధుసూదన్‌రెడ్డి, పి.రమాదేవి జంట హత్యల కేసులో నేరం రుజువు కానందున కేసును కొట్టివేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి గురువారం తీర్పు చెప్పారు. 2013 డిసెంబర్ 29న రాత్రి 10 గంటలకు నిందితులు ఇంటిపై దాడి చేసి డబ్బు, బంగారం దోచుకోవడానికి జంట హత్యలకు పాల్పడ్డారు. డబ్బు దొరకకపోవడంతో ఒంటిపై ఉన్న బంగారాన్ని ఎత్తుకెళ్లారు. హతుడి తమ్ముడు పి.ధనుంజయరెడ్డి ఫిర్యాదు మేరకు కర్నూలు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు జరిపి నిందితులు మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన వడ్డె కుంబాపు వెంకటప్రసాద్, మటం రోహిత్ కుమార్, నవీన్ కుమార్, వెల్దుర్తికి చెందిన జి.సీరన్నలు కారణమని పోలీసులు చార్జ్ షీటు దాఖలు చేశారు. కేసు విచారణలోపే రెండో, మూడో నిందితులు మటం రోహిత్‌కుమార్, ఎం.రాజశేఖర్‌లు మరణించారు. మిగతా ముగ్గురిపై కేసు విచారణ జరిగింది. వీరిపై సాక్షాధారాలు రుజువు కానందున కేసు కొట్టివేశారు. నిందితుల తరపున న్యాయవాది బి.మురళీ మనోహర్ వాదించారు.

విద్యుత్‌శాఖ ఉన్నతాధికారికి వినతి

కర్నూలు న్యూసిటీ : విద్యుత్‌శాఖ మీటర్ రీడర్స్‌కి వేతనాలు ఎస్క్రో ద్వారా చెల్లించాలని మీటర్ రీడర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన సంఘనాయకులతో కలిసి ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ ఉమాపతిని కలిసి వినతి పత్రం అందజేశారు.

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్య సాధనకు ప్రణాళికలు

- వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో 15 శాతం వృద్ధిరేటు సాధించాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన కోసం అనువైన ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికను రూపకల్పన చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనపై జిల్లా, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వ్యవసాయం, పరిశ్రమలు, మానవ వనరులు, వైద్యం, విద్య నైపుణ్యాభివృద్ధి, సంక్షేమ శాఖల్లో ఆచరణ సాధ్యమయ్యే ప్రణాళికలను రూపొందించాలన్నారు. మండలస్థాయిలో ప్రణాళికల తయారీపై ఎంపీడీఓలు, మండలాల ప్రత్యేకాధికారులకు శిక్షణ ఇవ్వాలని సీపీఓ హిమ ప్రభాకరరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిలను ఆదేశించారు. అలాగే 100 రోజులు, వార్షిక, ఐదేళ్ల ప్రణాళికలపై ప్రతి శాఖ లక్ష్యాలను రూపొందించి నివేదించాలన్నారు. రాష్ట్ర స్థాయి నంచి స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ పంపిస్తారని, దానిపై జిల్లాలో రైతులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులతో చర్చావేదికలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కాగా, కలెక్టర్ తొలుత 100 రోజుల్లో సాధించిన ప్రగతిపై శాఖల వారీగా సమీక్షించారు. సెప్టెంబర్ 19 నుంచి వచ్చే వంద రోజులకు మళ్లీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో చిరంజీవి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుకను సరఫరా చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సీఎం చంద్రబాబునాయుడుకు వివరించారు. గురువారం విజయవాడ నుంచి సీఎం కలెక్టర్లు, జేసీలతో ఉచిత ఇసుకపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను చంద్రబాబుకు కలెక్టర్ వివరించారు. ప్రతి రోజూ ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా 7500 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాకు కలిపి ప్రతిరోజూ 5 వేల మెట్రిక్ టన్నుల ఇసుక డి మాండ్ ఉందని, డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఇసుక ధరపై జీఎస్టీ తగ్గడంతో రూ. 326 నుంచి రూ.320కు తగ్గించినట్లు చెప్పారు. అనంతరం ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ పోస్ట ర్లను కలెక్టర్, జేసీలు ఆవిష్కరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, మైనింగ్ డీడీ రాజశేఖర్, టీడీసీ శ్రీధర్,డీపీఓ నాగరాజునాయుడు పాల్గొన్నారు.

జీతాలడిగితే...మాకు సంబంధం లేదంటున్నారు

- ఆసుపత్రి అధికారులపై సెక్యూరిటీ గార్డుల ఆవేదన



ఆసుపత్రిలో ధర్నా చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

కర్నూలు(హాస్పిటల్): 'మాకు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. జీతాలు ఇప్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగితే మీరు మాకు సంబంధం లేదని, నా వద్దకు రాకూడదని చెబుతున్నారు' అని సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం వారు ఆసుపత్రిలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము విధుల్లో చేరినప్పటి నుంచి ఏ నెల కూడా సక్రమంగా జీతాలు ఇవ్వలేదన్నారు. ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ వారిని అడిగితే స్పందన లేదని, ఇక్కడి ఎస్‌వో పట్టించుకోవడం లేదని, ఆసుపత్రి అధికారులను అడిగితే నా వద్దకు రావొద్దని చెబుతున్నారని, ఇక తాము ఎవ్వరిని వేడుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిసారి నాలుగైదు నెలలకు ఒకసారి జీతాలు ఇస్తున్నారని, అది కూడా ఒకటి, రెండు నెలలు కలిపి మాత్రమే ఇస్తూ మిగిలినవి పెండింగ్‌లో ఉంచుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తమకు జీతాలు ఇప్పించాలని వారు కోరారు.

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న సెక్యూరిటీగార్డులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ వైద్యశాల సెక్యూరిటీగార్డుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ప్రణీత్లు డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు.

కార్మికులకు జీతాలు ఇప్పించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజి, నర్సింగ్ కాలేజి హాస్టల్, కంటి ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఆ జీతాలు ఇప్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డికి సీఐటీయూ నాయకులు అబ్దుల్ దేశాయ్, విజయ రామాంజనేయులు, మహమూద్, గురువారం వినతి పత్రం సమర్పించారు.

సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు : సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి వాటిని వినియోగించే మహిళలు, యువతులు వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్తలు వహించాలని ఒకటో పట్టణ సీఐ రామయ్య నాయుడు సూచించారు. మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ఉస్మానియా కళాశాలలో మహిళల భద్రతపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఒకటో పట్టణ సీఐ రామయ్య నాయుడు కార్యక్రమానికి హాజరై మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈవ్ టీజింగ్, సైబర్ నేరాల గురించి కూడా అవగాహన కలిగి ఉండాలని వివరించారు. మొబైల్ ఫోన్ల వినియోగం, సోషల్ మీడియా ప్రభావం యుక్త వయస్సు వారిపై ఎలా ఉంటుందో వివరించారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సమ్మద్దీన్, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దిన్, లీగల్ సర్వీస్ అడ్వకేట్ సులోచన, వన్‌స్టాప్ సెంటర్, సచివాలయ మహిళా పోలీసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్పోర్ట్స్

హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కల్లూరు: ఏపీ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు కర్నూలు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి భాస్కర్ ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, పీడీ దాసరి సుధీర్ గురువారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు కడప జిల్లాలో జరిగే సబ్ జూనియర్ పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు వెల్లడించారు. అనంతరం భాస్కర్‌ను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కల్లూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. గురువారం స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ కర్నూలు మండల టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారితో పాటు ఎంఈఓ వినోద్‌కుమార్, దాత శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇష్టమైన క్రీడను ఎంచుకుని అందులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు నియోజకవర్గ కోఆర్డినేటర్ విజయకుమార్, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు చిన్న సుంకన్న, వ్యాయామ ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

-స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన మండల స్థాయి అండర్-14 చెస్ ఎంపిక పోటీల్లో బ్రైడో విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావ్య, డైరెక్టర్ కార్తీక్ ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయి

కల్లూరు: క్రీడల వలన నాయకత్వ లక్షణాలు అలవడుతాయని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు అన్నారు. గురువారం విఠల్ నగర్‌లో గుడ్‌షెప్పర్డ్ క్రీడామైదానంలో జిల్లా స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రముఖ న్యాయవది శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

జిల్లా హ్యాండ్ బాల్ జట్ల ఎంపిక

కల్లూరు: ఈ నెల 20, 21వ తేదీల్లో కడప జిల్లాలో జరిగే 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల హ్యాండ్ బాల్ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధి చిన్న సుంకన్న ప్రకటించారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్‌రెడ్డి, పాల్గొన్నారు.